కథా నిలయం
240
శ్రీకాకుళం

# నన్ను అర్థం చేసుకోరూ ?

"సిస్టర్ ! నాకేం పాప పుట్టింది ?"

దూరంగా ఇతర మంచాలదగ్గిర తిరుగుతూన్న నర్సుల నెవరినైనా పిల్చి అడిగెయ్యాలని రాజేశ్వరి మనస్సు ఆరాట పడిపోయింది.

తీరా అడిగితే ఏ పాప పుట్టిందని చెప్తారో !

పట్టీపట్టనట్టు ఎంత తేలిగ్గా జవాబిస్తారో !

"మీకు ఆడపిల్లే పుట్టిందమ్మా !" అనేస్తే ! అమ్మో? ఒద్దు, ఒద్దు. తనకి ఆడపాప ఒద్దు ఎంతమాత్రం ఒద్దు—తన గర్భంలో ఆడశిశువుని పెట్టవద్దని ఆదిలోనే వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఈ లోకంలో ఓ ఆడపిల్లకి తల్లి కాకూడదని అంతులేని ప్రార్థనలు చేసింది—అయినా తనకీ ఆడపిల్లే పుడుతుందా ? మనసారా మొక్కిన మొక్కులకూ, పవిత్రంగా చేసిన ప్రార్థనలకూ బొత్తిగా విలువ లేకుండా పోతుందా ? లేదు. లేదు భగవంతుడు దయామయుడు ఎవరేది కోరితే అదే యిస్తాడు గానీ అంత కఠినంగా తను వద్దనుకున్న ఫలాన్నెందుకు ఒడిగడతాడు ?—ఎప్పుడూ కాదు. ఆ ధైర్యంతోనేగా నవ మాసాలూ సంతోషంగా మోసిందీ....! మగబిడ్డని కంటాననే గర్వంతో తిరిగిందీ....! కొడుకునే కని....

"ఎంత సేపైందమ్మా లేచి! నీరసంగా వుందా ?" ఓ నర్సు దగ్గిరిగావచ్చి పరామర్శిస్తోంటే, ఏం చెప్తుందోనని రాజేశ్వరి గుండెలు ఉధృతంగా కొట్టుకున్నాయి. మరో నర్సు నవ్వుతూవచ్చి అననే అంది—
"మీకు పండులాంటి పాప పుట్టిందమ్మా ! మెలకువ రాగానే యీ కబురు చెప్దామని...." విద్యుద్ఘాతం తగిలినట్టు అదిరిపడింది రాజేశ్వరి. చటుక్కున తలతిప్పి కళ్ళెత్తి చూసింది. ఆ మొహంలో....ఆ చూపుల్లో కొట్టవస్తున్న భయం....ఆందోళన....బాధ .... అయిష్టం .... నర్సు లిద్దరూ కంగారు పడేలా చేశాయి.

"అదేమమ్మా అలా చూస్తున్నారు? మా మాట మీకు నమ్మకం లేదా? నిజంగా మీకు ఆడపాప పుట్టింది. తెల్లగా—బొద్దుగా—ఆరోగ్యంగా వుంది. ఇప్పుడే పడుకుని నిద్రపోతోంది. మీరు కొంచెం కాఫీ తీసుకుంటే...." ఠీవిగా నిలబడ్డ శిఖరాల మీదనుంచి కూలిపోయిన దానిలా కళ్ళు దించేసుకుంది—'అయ్యో! భగవంతుడా' అంటూ ఘోషించింది రాజేశ్వరి అంతరాత్మ—'నువ్వెంత కఠినాత్ముడివి? ఎంత ఆశపెట్టి మోసగించావు! నీ కసలు హృదయం ఉందా? నావంటి దౌర్భాగ్యులమీద కొంచమైనా కనికరం వుందా? మగబిడ్డనే కన్నట్లు ఎన్నోసార్లు కలలుగన్నానే! నా కొడుకుని ఒక మానవుడిగా పెంచగలవని మురిసిపోయానే! అయ్యో....!'

రాజేశ్వరి కనుకొలుకుల్లో నిండుగా నీటిబొట్లు నిలిచాయి.

"ఎందుకమ్మా అలా బాధపడతారు? మొదటిసారి ఆడబిడ్డ లక్ష్మీదేవితో సమానమంటారు. మళ్ళా ఈ రోజులు వస్తే కొడుకునే ఎత్తుకుంటారు. బిడ్డలకేం భాగ్యం?"—అప్యాయంగా నర్స్ హాస్యమాడుతోంటే జీవంలేని నవ్వొకటి నవ్వింది రాజేశ్వరి.

మొట్టమొదటి సారిగా పాపని ఒడిలో పడుకోబెట్టుకుంటే దుఃఖం పెల్లుబికివచ్చింది—'నువ్వు పుట్టావని సంతోషించలేని ఈఅమ్మని క్షమించు తల్లీ! ఆడదాని ఆత్మాభిమానాన్ని అడుగడుగునా అవహసించే ఈ నికృష్టపు లోకంలో నువ్వెలా బ్రతుకుతావమ్మా! నీ దుఃఖానికి కారణం తెలిసికూడా దాన్ని నివారించలేని నేను—నిన్ను కనకుండా వుంటే ఎంత బావుండును! ఎంత బావుండును! పాపని గుండెలకి హత్తుకుని దీర్ఘంగా నిట్టూర్చింది. స్త్రీ జీవితం ఓవిషాద స్వప్నం అభమూ శుభమూ తెలీని నువ్వు ఆ విచిత్ర స్వప్నంలో యిప్పుడే కాలుపెట్టావు. నిన్ను నేనెలా రక్షించను? 'పాపా!'—సున్నితమైన పాప నుదురు చెంపలతో తాకి మరోసారి నిట్టూర్చింది రాజేశ్వరి.

సంతృప్తినివ్వని తన జీవితాన్ని నెమరేసుకుని, బాధా పూరితంగా నిట్టూర్చటంలోనే ఏదో తృప్తీ, హాయీ పొందగలుగుతోంది ఆమె.

కూతుర్ని చూడడానికి వచ్చిన మధుమూర్తి సంతోషంగా భార్య కళ్ళల్లోకి చూడబోతే కళ్ళు తిప్పుకొంది రాజేశ్వరి. అయినా ఆమెకు చేరువుగా నిల బడి చేయి నిమురుతూ — "రాజీ! పాపని, చూశాను. ఎంత ముద్దుగా వుందనీ! నీ పోలికేం కాదు. అంతా నా పోలికే సుమా! అవును కదూ!" అని మురిపెంగా మాట్లాడుతుంటే చటుక్కున మొహం తిప్పి ఆవేశంగా అంది. "అవును పాపకి నా పోలికెప్పుడూ రాకూడదు. రానివ్వను."

తన సంతోషంలో భార్యమాట అంతగా పట్టించుకోలేదు మూర్తి. అయినా భార్య ధోరణి అతనికి కొత్తకూడా కాదు. అతని దృష్టిలో అది పిచ్చిధోరణి కూడాను. విరక్తిగా ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ, ఏదో చూస్తూ నిట్టూర్పులు విడిచే రాజేశ్వరి తత్వం మధుమూర్తి కేమంత సరిపడదు కూడాను.

రాజేశ్వరి యెక్కువ చదువుకున్నది కాదు. కాని చదువుకుంది. గొప్పగా, ఘనంగా మాట్లాడలేదు. కాని మాట్లాడుతుంది, ఆలోచిస్తుంది. తన అభిప్రాయాలు బహిరంగంగా వెల్లడించలేదు — కాని నిర్దుష్టంగా ఏర్పర్చుకుంటుంది. "వ్యక్తిత్వం విలువ గ్రహించినవాళ్ళే ఎదుటివారి వ్యక్తిత్వాన్ని కాపాడుతారు" అన్న విషయాన్ని రాజేశ్వరి మనస్ఫూర్తిగా అంగీకరిస్తుంది.

రాజేశ్వరిలో ఎప్పుడూ ఆ నిరుత్సాహం — నిట్టూర్పులూ — ఆ వైరాగ్యం — ఆవేదనలూ అవన్నీ ఎందుకో మధుమూర్తి ఎన్నడూ పట్టించుకోలేదు, రాజేశ్వరి మధుమూర్తికి చెప్పుకోలేదు,—అర్థం చేసుకునే అవకాశాలు రాకపోలేదు, తను అర్థం చేసుకోవాల్సిన విషయం ఏదో వున్నదన్న సంగతి కూడా మధుమూర్తికి అర్థంకాలేదు—భార్యని ఎప్పుడూ ప్రేమిస్తూనే వున్నాడు. గారాంగానే పువ్వులా చూసుకుంటూనే ఉన్నాడు. చీరలు కొంటూనే వున్నాడు, నగలు చేయిస్తూనే ఉన్నాడు. ఏ విధం గానూ లోటులేకుండా పోషించుకుంటున్నానని గర్వపడుతూనే ఉన్నాడు.

రాజేశ్వరికూడా మధుమూర్తిని మనస్ఫూర్తిగా విశ్వసించింది. అతని అనురాగాన్ని గానీ — అతని అభిమానాన్ని గానీ ఎప్పుడూ

శంకించలేదు. అతను భర్తగా తనకేలోటూ చెయ్యటంలేదనే ఆమె ఉద్దేశ్యం-కాని....అతను....మధుమూర్తి .... అక్షరాలా భర్తగానే వున్నాడు. అతనిలో కరిగి లీనమైపోవాలని కలలుగన్న తనని భార్యగా మాత్రమే ఉంచుకున్నాడు. తాళికట్టిన భర్త దగ్గిర కేవలం తలదించి ప్రతికే భార్య లాగే కాకుండా తనకో అమూల్యమైన స్థానం కావాలి. అతనికి ప్రియాతి ప్రియమైన ప్రేయసిలా—మనస్సులో మెదిలే భావంలా-కంటిలో కదిలే చిరుపాపలా—అతనిలో తాను ఐక్యం చేసుకుని – "భగవాన్! అంత భాగ్యమా? ఎంతటి వాళ్ళకి!"

ఒకప్పటి తన ఆశ దురాశగా—తన కోరిక తీరనిదిగా — తన ఆలోచన పేలవంగా – తన వ్యక్తిత్వం దూదిపింజెలా— తేలిపోతూన్న సమయంలో రాజేశ్వరి కార్చే కన్నీటికి కొదవేమిటి? అంతమెక్కడ?

ఏనాటికీ ఆయన తనని అర్థం చేసుకోరా? ఏనాటికీ....! పసిపాపని పొత్తిలా గుండెలకి చేర్చుకొని కళ్ళుమూసుకుంది కన్నతల్లి.

గతంలో....ఎన్నోస్మృతులు....ఎన్నెన్నో గుర్తులు, డైరీ పుటల్లా అక్కడొకటీ....అక్కడొకటీ కదుల్లాడుతున్నాయి.

◆ ◆ ◆

ఆరోజు మధుమూర్తితో ఓ స్నేహితుడు కూడా వచ్చాడు ఇంటికి. ఎప్పటిలాగే రెండు కాఫీకప్పులు ట్రేలోపెట్టి తీసుకువెళ్ళి టేబుల్‌మీద పెట్టివచ్చింది రాజేశ్వరి. తిరిగి తన వంటపనిలో మునిగిపోయింది. ఆ స్నేహితుడు ఎప్పుడు వెళ్ళాడో కూడా తను పట్టించుకోలేదు. కాని మధుమూర్తి విసురుగా వంటింట్లోకి వచ్చి ఏదో అంటోంటే తలయెత్తి చూసింది- "అలా అర్థంకానట్టు చూస్తావేం? అతనుండగా నువ్వే ఎందుకు తెచ్చావ్ కాఫీ!

రాజేశ్వరికి నిజంగానే మూర్తి అనేదేమిటో అర్థం కాలేదు– "మీ స్నేహితులు వున్నా నేను కాఫీ యిస్తుంటాను కదూ!"

"గొప్పపని చేస్తావ్. అతనేం నాకంత స్నేహితుడు కాదు. ఎన్ని సార్లు వాళ్ళింటికి తీసికెళ్ళినా సభ్యత కోసమైనా ఒక్కసారి తన భార్యని

నాకు పరిచయం చెయ్యలేదు-అతనికి నిన్ను చూపించనే కూడదను కున్నాను, అంతలోనే నిన్నెవరో ఆహ్వానించినట్టే ప్రత్యక్షమై నన్ను చెప్పుతో కొట్టినట్టు చేశావ్!''

విస్తుపోయింది రాజేశ్వరి, మరో క్షణానికైనా తేరుకోలేనంతగా, వచ్చిన స్నేహితుల ఎదటికి పిల్చి పరిచయం చేయించి—కాఫీ లిప్పించి—కబుర్లు చెప్పించి——చనువుగా మసలనివ్వటానికీ—పచ్చని వ్యక్తుల పరిస రాలకైనా రానీయకుండా—భార్య నీడనికూడా కన్పించనీయకుండా రహ స్యంగా దాచటానికి....హు! ఎంత చిత్రమైన ప్రయత్నం! మనిషిగా తన మాటేమిటి? ఓ ప్రాణిగా తన వునికినీ, ఓ వ్యక్తిగా తన వ్యక్తి త్వాన్ని నిలువునా హత్యచేసి అపహసించే ఈ బాధకన్నా కత్తులతో చిత్రహింస చేస్తే సుఖంగా వుండదూ? ఏనాడూ తను ఊహించని ఈ చులకన భరించగలదా? ఈ అఘాతానికి తట్టుకోగలదా?

"ఏమిటా ఆలోచన? అడిగిందానికేం చెప్పకుండా...."

"నన్ను రావద్దని ముందే చెప్తే ...." ఏదో అనబోయింది నెమ్మదిగా.

"చాల్లే నేర్చావ్. రావద్దని చెప్పలేదు గానీ రమ్మని చెప్పానా? నేను లోపలికి రాకుండానే నీకంత కంగారెందుకు? కత్తిదూసినట్టు ఎదురు జవాబు లివ్వడం మాత్రం బాగా వంటబట్టింది."

"మీ రడిగినదానికి జవాబు చెప్పకపోతే ఎలా?" విస్మయం కలిగింది.

"చెప్తే అదేనా పద్ధతి? తెలీక చేశావనీ, మరెప్పుడూ అలా చెయ్యనని అంటే సరిపోదూ? నా దగ్గిర తప్పు ఒప్పుకోటానికి నీకు నామోషియా?"

"క్షమించండి. నేను తప్పుచేశానని అనుకోలేదు."

"అ....ను....కో....లే....దు. చేసింది చాలక సమర్ధనకూడాను. నీలాగే ఆ వచ్చిన పెద్దమనిషీ బుద్ధిలేనివాడే. తన పెళ్ళాన్ని ఘోషాలో దాచేసుకుని...."

రాజేశ్వరికి చిరాకు వేసింది —"దాచటానికి ఆవిడేం బొమ్మా? ఓ మనిషిగా ఆవిడభిప్రాయాలు ఆవిడికి లేవూ! ఎప్పుడూ నలుగురిలోకి వచ్చే అలవాటు లేదేమో? అతనేం చెయ్యగలడు?"

"ఓహో? నలుగురిలో మసిలే అలవాటు ఆవిడకు లేదుగానీ — పదిమందిలోనూ పరుగెత్తే అలవాటు నీకే వుందన్నమాట. సిగ్గులేదూ! ఆవిడకన్నా నువ్వేం డిగ్రీలు సంపాదించావా? పట్టాలు పుచ్చుకున్నావా? ఏం గొప్పదానివి?"

అప్పటికే రాజేశ్వరి కళ్ళు నిండుకొస్తోంటే చటుక్కున తల దించేసుకుంది మధుమూర్తి ఓ క్షణం మౌనంగానే నిలబడ్డాడు—"నీ వాదనేం బాగాలేదు సుమా! ఒప్పుకుంటే సరిపోయేదానికి వాగుడు పెంచుతావ్" తప్పంతా నీదేనన్నట్టు చేతులు దులుపుకుని వెళ్ళిపోయాడు.

తుడుచుకుంటున్న కొద్దీ కన్నీళ్ళు వురుకొస్తోంటే మౌనంగా కూర్చుంది రాజేశ్వరి—తను తప్పు చేసిందట — అలాని ఆయన అంటే తను ఒప్పుకోలేదు. అదే తను చేసిన తప్పు. భర్త చేసే అధికారాన్ని భార్యలాగా సహించే శక్తి అలవర్చుకోక పోవడమే పెద్ద తప్పు.

ఎక్కడెక్కడో తిరిగి రాత్రివేళ యింటికి వచ్చేసరికి అంతా మర్చిపోయాడు మధుమూర్తి— ఎన్ని గంటలు కాదు, ఎన్ని యుగాలు గడిచినా ఏమీ మర్చిపోలేదు రాజేశ్వరి. భోజనాలయ్యాక మృదువుగా పలకరించాడు మధుమూర్తి—" అలా వున్నావేం రాజీ? ఆ గొడవింకా మనస్సులోనే పెట్టుకున్నావా?"

అదోమాదిరిగా నవ్వింది రాజ్యం — "మనస్సులో పెట్టుకోటానికి నాకో మనస్సు వుందనేనా మీ వుద్దేశం?"

"అబ్బో కథల్లోలాగ మాట్లాడుతున్నావే!"

"కథలు మనమేగా రాసుకుంటాం!"

"నీ సంభాషణ ప్రారంభిస్తే పిచ్చి పిచ్చిగా మాట్లాడుతావు. పోనీగానీ ఈ వీక్లీలో 'పశ్చాత్తాపం' కథ చదువ్ ఎంత బావుందో!"

"చదివాను. నా కంత బాగాలేదు" విసుగ్గా అంది.

"అదేవిటి అలా అనేశావ్? ఏదో చిన్నతగూ తెచ్చుకుని మొగుడు మీద అలిగి పుట్టింటికి చేరిపోయిన ఆడది కొన్నాళ్ళకైనా దేవుడో అంటూ కాళ్ళబేరానికి రాక ఏం చేస్తుంది!"

"చచ్చిపోవచ్చుగా?"

"చాల్లే, నీ విమర్శ నువ్వూను చచ్చిపోవటం అంత తేలికను కున్నావా?"

"ఏంత తేలికో నాకు తెలీదుగాని వ్యక్తిత్వాన్ని, అభిమానాన్ని చంపుకోటంకన్నా తేలికే."

"నువ్వే అయితే అలాగే చేస్తావా!"

"అసలు నేనా పరిస్థితి తెచ్చుకోను. క్షణికావేశాలతో వివేకాన్ని కోల్పోను? ఈ కథలో నిటంగా తప్పుచేసింది భర్త. క్షమించలేకపోవటం ఆమె బలహీనతేగాని అపరాధం కాదు. పశ్చాత్తాపం కలగాల్సింది తప్పు చేసిన భర్తకేగానీ ఆమెకికాదు—కొన్నాళ్ళు వుండిపోవటంతో పుట్టింటివాళ్లు చులకన చెయ్యటం పరపురుషులు పల్కరించబోవటం — భర్త నీడే తన గొడుగనుకొని ఆవిడ పరిగెత్తుకురావటం—విజయగర్వంతో చిరునవ్వులు చిందిస్తూ అతగాడు అభయహస్తం యివ్వడం—ఆవిడ పశ్చాత్తాపంతో వెక్కి వెక్కి ఏడవటం....ఇదా కథ? నేరానికి శిక్షపడలేదు. వ్యక్తిత్వా నికి విలువ కన్పడలేదు. ఇదా సాహిత్యం? 'భర్తలు తప్పులు చేస్తారు. భార్యలు క్షమించండి. అప్పుడే వుత్తమ యిల్లాళ్ళు కాగలరు' — ఇదేనా సందేశం? .... అందుకేనా మీకంత బావుంది?" రాజేశ్వరి సూటిగా చూసింది.

మధుమూర్తి ముఖంలో తిరస్కారం స్పష్టంగా కన్పించింది — "నీ మొహం? అర్థంపర్థంలేని ధోరణీ నువ్వూను. మన దేశాచారాలూ— మన నీతినియమాలూ— మన కట్టుబాట్లూ యేవ్వాళెలాపోతాయ్? నీ ఆలో చనలే ప్రతీ ఆడదానికి వుంటే సంసారాలు మహానందంగా సాగేలా వున్నాయ్."

"మీరెన్ని వెటకారాలైనా చేయొచ్చు. ఆ అధికారం మీకు వుంది. కాని ఒక కథమీద అభిప్రాయం ఏర్పర్చుకునే అధికారం నాకూ వుంది. నాలా ఆలోచించే ఆడది సంసారాన్ని సంతోషమయం చేసినా తాను శాంతిగా మాత్రం వుండలేదు."

మధుమూర్తి రాజేశ్వరి కళ్ళలోకి చూశాడు — "నువ్వు శాంతిగా బ్రతకటం లేదా?"

"ఆ పరిస్థితి వేరు. దానికీ దీనికీ ముడిపెట్టకండి- పుస్తకాల విషయమై మాట్లాడితే మాత్రన ఆడదాన్ని గురించి ఎవ్వరూ రాయటంలేదంటున్నాను ఆడది ఎందుకు ఏడుస్తోందో కూడా ఎవ్వరూ ఆలోచించరు."

"ఇన్ని ఆలోచిస్తున్నావ్? నువ్వే రాయకూడదూ!" నవ్వుతూ అన్నాడు మధుమూర్తి -రాజేశ్వరికూడా కొంత తేలిగ్గా నవ్వుతూ అంది- "నేను రాస్తే మరి మీరెవర్ని చూసి నవ్వుతారు?"

ఎంత ఆడదానివై పుడితే మాత్రం, ఆడవాళ్ళంటే ఎందుకలా పడిచస్తావ్?" మధుమూర్తి మాటలు తేల్చేసేముందు ఎప్పుడూ అలా అంటూనే వుంటాడు. అద నిజంకూడాను.

ఆడవాళ్ళంటే రాజేశ్వరికి ఏమిటో దయ — ఆడవాళ్ళ బాధలంటే ఏదో సానుభూతి -ఆడవాళ్ళ చరిత్రలంటే ఆసక్తి-ఆడదై పుట్టినందుకు తనమీద తనకే జాలి-ఎవరిమీద ఎంత కరుణ వుండిమాత్రం తనేం చెయ్యగలదు? తనూ ఓ ఆడపిల్లని కన్నది. తనూ కొంత దౌర్భాగ్యాన్ని-కొంత విషాదాన్ని సృష్టించింది. తన పాప....ఆడది!

* * *

పక్కలో పాప మెత్తగా కదిలింది — చక్కలిగింతలు పెట్టినట్టు రాజేశ్వరి తదేకంగా కూతుర్ని చూచుకొంటూ కూర్చుంది-ఇది ఓ చిత్రమైన అనుభూతి — ఈ అనుభూతికూడా ఆడదానికే. అందుకే కాబోలు చలం అంటాడు — 'బిడ్డతోపాటు ఆడదానికి రొమ్ముల్లోపాలూ — గుండెల్లో ప్రేమా పుట్టుకొస్తాయని'. నిజమే. ఈఘడియ లన్నింటినీ యధాతధంగా డైరీలో రాసుకోవాలి. ఈ అనుభూతులన్నీ సజీవంగా చిత్రించు

కోవాలి ఎప్పుడో....ఎప్పుడెప్పుడో పాప పెద్దదయ్యాక... తన వయస్సు పుడిగాక.... ఈ రాతలు చదువుకుంటే కళ్ళు సరిగ్గా కన్పించని తనకు ఆ రాతలన్నీ పాపే చదివి విన్పిస్తే ....?—ఒళ్లు పులకరించింది— పాప బుగ్గలమీద తాకుతూ నిట్టూర్చింది —డైరీకోసం.... తనెంత ప్రయత్నం చేసింది.

ఆ సాయం సమయం పెరట్లో మందార చెట్టునీడన కూర్చుని ఆకాశంలోకి చూస్తోంటే....ఏదో రాసుకోవాలని బుద్ధి పుట్టింది. తళుక్కున ఓ ఆలోచన మెరిసింది—డైరీ రాసుకుంటే ...? తను.... డైరీ ....అబ్బ! ఎంత బావుంటుంది! మనస్సులో ఎప్పుడూ రేగే ఈ ఆలోచనలూ — ఎప్పుడూ మెదిలే ఈ వూహలూ —ఈ ఆశయాలూ—కోరికలూ—అన్నీ.... అన్నీ ఎవరికి చెప్పుకుంటుంది? ఎలా చెప్పుకుంటుంది?....తనకి తనే చెప్పుకుంటే.... తనకి తనే ఓదార్చుకుంటే... ఎంత హాయి! ఎంత తృప్తి! ఎంత శాంతి!

అంతానందంతోనూ అడిగింది భర్తని— "నాకో డైరీ తెచ్చిపెడతారా?"

చిత్రమైన కబురు విన్నట్టు చూశాడు మధుమూర్తి— "డైరీ! నీకా? ఎందుకూ? రాయటానికే! ఏం రాస్తావబ్బా?"

అపహాస్యం రుచించలేదు రాజేశ్వరికి. మౌనం వహించింది.

"అబ్బో! కోపం వచ్చినట్టుందే! డైరీ తెమ్మంటావా!"

"వీలైతే రాద్దామనుకున్నాను."

"నాకు తెలీకడుగుతానూ, నువ్వేం రాస్తావు డైరీలో? నీకేం వ్యవహారా లున్నాయనీ-పెద్ద కవయిత్రిలాగ....?" మాటలు ఆపి నవ్వేశాడు మధుమూర్తి.

"పొరపాటే. డైరీ రాసుకోటానికి కవిత్వం కావాలనుకోలేదు."

"అబ్బ! నీకీ తలబిరుసుతనం తగ్గదు మరి. నే నేదో సామరస్యంగా మాట్లాడబోతే ప్రతిదానికీ అపార్థాలు తీస్తావ్. ఈసారి నిజంగానే అంటున్నాను. డైరీ రాయటం మాటలనుకున్నా వేమిటి? క్రిందటి సంవత్సరం నేనే మూడొంతులు ఖాళీగా వుంచేశాను."

గులాబీకన్నా మృదువైన రాజేశ్వరి హృదయంలో ఓ మోటుముల్లు గుచ్చుకుంది—మగవాడైన తనభర్తే చెయ్యలేనిపని తనేం చెయ్యగలదు? మగవాడికి లేని శక్తిసామార్థ్యాలు తన కెక్కడున్నాయి?- అలానే తను సరిపెట్టుకోగలదా ? తన ఆశకి అర్థంలేదా? తన వాంఛకి విలువే లేదా!

కాఫీ కప్పు తీసుకుని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

రాత్రికి మధుమూర్తి తిరిగివస్తూ చక్కని పేకెట్టు అందజేశాడు భార్యకి.

"ఏమిటి ?"

"చూడుమరి, తినబోతూ రుచి అడుగుతావేం?"

రాజేశ్వరిలో ఏదో ఆశ అఖండంగా వెలిగి ఆరిపోయింది – తనకి భర్త తెచ్చి యిచ్చింది—గులాబీరంగుమీద బంగారు చుక్కలున్న కొత్త సిల్కుగుడ్డ.

గర్వంగా మెరుస్తూన్న భర్త మొహంలోకి చూస్తూ తన అసంతృప్తి కన్పించనివ్వకుండా అంది—"ఇప్పు డెందు కిది ? చాలా వున్నాయిగా ?"

"మొన్నటి చీరమీదకి మంచిగుడ్డ కొనలేదుగా. మా స్నేహితు డొకడు ఏవో గుడ్డలు తియ్యటానికి వెళుతూ నన్ను పిలిచాడు. తీరా వెళ్తే నాకిది నచ్చింది. గజం యెంతో తెలుసా ? పన్నెండు ! పైసలు కాదు, రూ....పా....య....లు—అయినా సరే తీసేశాను. ఇది చోళీకుట్టుకుని నువ్వు తొడుక్కుంటే ఎంత బావుంటుందో తెలుసా ? మెరిసిపోతావ్ బొమ్మలా ! అదేం అలా చూస్తావ్. నీకు నచ్చలా ?"

'నేను బొమ్మనికాదు .... మనిషిని ! మనిషిని ! కోరికలతోవున్న మనిషిని !' అని ఏడవాలనిపించింది రాజేశ్వరికి.

అందంగా తన శరీరాన్ని సింగారించి, దాని సోయగం చూసుకోవటమేనా భర్తగా అతని ధర్మం ? తన మనస్సు కాంక్షించేదాన్ని తీర్చి, మానసికంగా చేరువకావాలన్న విషయం అతనికి అర్థమే కాదా ?

"ఏం రాజీ ! నీ కంత నచ్చినట్టు లేదే !"

"ఎందుకు నచ్చలేదు? చాలా అందంగావుం . ఇంత ఖర్చుపెట్టి యిప్పు డెందుకని నా వుద్దేశమే గానీ...."

"నీ వుద్దేశాల కేంలే. అన్నీ యిలాగే చెప్తావ్, గుడ్డలూ నగలూ వద్దనే ఆడదాన్ని నిన్నే చూశాను. నిన్ను అందంగా వుంచుకోవాలని నేను ప్రయత్నిస్తే తప్పా ఏమిటి? సరేగాని... ఈ చోళీ రేపే వేసుకోవాలి. తెలుసా? బద్ధకించాననీ .... కుట్టుకోలేదనీ .... అంటే మరి వూరుకోను."

"అలాగే."

రాజేశ్వరి హృదయంలో మరో అసంతృప్తి పొర పేరుకుంది. మరో ఆవేదన అల లేచి పడింది—తనకి భార్యలాగా బ్రతకటం చేతకావటంలేదు. ఏపూటా పిండివంటలు తిని సంతృప్తి పడుతూ—నెలకో కొత్త చీరో కొత్తనగో కావాలని మారాంచేస్తూ—కోపం వచ్చి తిట్టిపోస్తే దులపరించుకు తిరుగుతూ, తాపంవచ్చి దగ్గిరికి తీసుకుంటే అదే అదృష్టమని మురిసిపోతూ కొన్ని హద్దుల్లో – కొన్ని నిబంధనల్లో — కొన్ని సుఖాలతో—కొన్ని దుఃఖాలతో—అక్షరాలా భర్తదగ్గిర భార్యలాగా బ్రతకటం తన కిష్టంలేదు. ఎప్పు డీ జీవితానికి విముక్తి? ఎక్కడీ ఆవేదనలకి అంతం?

ఆ రాత్రి పడుకోటానికి రాకుండా పక్కగదిలో కూర్చుని రాజేశ్వరి ఏదో రాసుకొంటోంటే మధుమూర్తి లేచి వెళ్ళి చూశాడు.

"ఏమిటి రాజీ రాస్తున్నావ్? ఉత్తరాలేమైనానా?"

"కాదు. కొంచెం తెల్లకాయితాలుంటే ఓ పుస్తకం కుట్టాను. కేలండర్ దగ్గిర పెట్టుకుని తారీఖులు వేస్తున్నాను."

"ఎందుకూ?"

"ఏవైనా కొంచెం జ్ఞాపకం వుండాల్సిన విషయాలు రాసుకుందామని."

"అంటే డైరీ తయారు జేస్తున్నావా?" అతనిలో అత్యాశ్చర్యం.

"...............''

"మాట్లాడవేం? నీకంత పట్టుదలగా కావాలని చెప్తే తెచ్చే వాణ్ణిగా? మరోసారి చెప్పటానికి పౌరుషమా?"

"పౌరుషం ఎందుకూ? పోనీ కాయితాలు వుండనే వున్నాయి కదాని కుట్టాను."

"రాజీ! నీ తత్వం నాకు తెలుసు. నీ కీ అహంకారం పనికిరాదని లక్షసార్లు చెప్పాను."

"ఇప్పుడు నే నేం తప్పు చేశానని మీకు కోపం వస్తోంది?" తల ఎత్తి చూసింది రాజేశ్వరి.

"అబ్బే నువ్వే తప్పూ చెయ్యలేదు నువ్వేం చేసినా ఒప్పే" హేళనగా అనేసి విసురుగా వెళ్ళిపోయాడు మధుమూర్తి. చేస్తూన్న పని ఆపి కొంతసేపు నిర్లిప్తంగా కూర్చుంది రాజేశ్వరి—తనేం తప్పు చేసిందో తనకి తెలుసు. తనకి కావలసిన వస్తువుకోసం అతన్ని పదే పదే ప్రాధేయ పడకపోవడం తప్పుగాదూ? మగవాడిగా అతని ఔన్నత్యాన్ని అంగీకరించి, ఆడదానిగా తన అప్రయోజకత్వాన్ని రుజువు చేసుకుంటూ తన ఆత్మాభిమానాన్ని చంపుకోకపోవటం తప్పేకదూ? ఆడదానికి పంతం వుండి దాన్ని మగవాడు ధిక్కరించలేని విషమస్థితి తేవటం తప్పుకాక ఒప్పెలా అవుతుంది—విరక్తిగా, నిరాశగా నవ్వుకుని తిరిగి క్యాలండర్ అంకెలమీదికి దృష్టి మళ్ళించుకుంది.

భార్యని భార్యగానే కాక మనిషిగా కూడా చూడాలన్న సంగతి మధుమూర్తి కెందుకు అర్థంకాదో ఆలోచిస్తే బోధపడని విషయమేమీ కాదు. రాజ్యం పోగొట్టుకోటానికి ఏ రాజూ ఒప్పుకోడు. అధికారం వదులుకోటానికి ఏ అధికారి ఇష్టపడదు—భార్యని మనిషిగా అంగీకరించ డానికి ఏ భర్తా ఆలోచించడు — కానీ .... ఎంతో చదువుకుని, ఎన్నో తెలుసుకోగలిగిన మధుమూర్తిలో కూడా ఆ బలహీనత ఉండిపోతే ఇక ఆడదాని అభాగ్యానికి అంతం ఏది? ఎప్పుడు?

రాజేశ్వరి హృదయంలో అశాంతి చెలరేగినప్పుడల్లా .... దానితో పాటు మధుమూర్తిపట్ల ఏదో చిత్రమైన సానుభూతికూడా పుట్టుకొస్తుంది. అతని ప్రవర్తన తనని బాధపెడితే అందులో అతను కావాలని చేసిందేమీ

లేదేమో! మనిషి పరిస్థితికి బానిసై పెరుగుతాడు. చాలావరకు తరతరాల నుంచీ నరనరానా జీర్ణమై వస్తూన్న మన సంస్కారం ఎంత వున్నతమైనదో అంత సంకుచితమైనదికూడా—స్త్రీ పట్ల హృదయ విహీనమైన ఈ సంస్కారం పురుషుడి పాదాలక్రింద పూలబాటలు పరుస్తుంది. మెత్తగా, హాయిగా నడవటానికే అలవాటు పడిన పాదాలు ముళ్ళు తగులుతోంటే ముందడుగు వెయ్యగలవా? — తనూ మగవాడై పుడితే మధుమూర్తికన్నా విశేషంగా ప్రవర్తించ గలదా – ఎలా సాధ్యం? .... చిత్రంగా నవ్వువచ్చింది రాజేశ్వరికి — మనసేదో తేలికైనట్టుకూడా అన్పించింది.

మూడో డైరీ ప్రారంభించాక పాప పుట్టింది.

పాప నెత్తుకుని రాజీ కులాసాగా యింటికి వచ్చినరోజు మధుమూర్తికి కూడా డైరీ రాసుకోవాలనిపించింది—"పాప గురించి శ్రద్ధగా రాస్తూవుండు డైరీలో" అన్నాడు మమకారంతో.

"మరి మీగురించి?" చిలిపిగా ప్రశ్నించింది రాజేశ్వరి.

"ఎప్పుడూ రాస్తూవున్నదేగా?"—

"అవును మీ జ్ఞాపకాలు నాకు కావాలి" భర్త కళ్ళలోకి చూస్తూ అంది రాజీ.

అలాంటిదే–అది మరో చిత్రమైన జ్ఞాపకం!

మధుమూర్తి స్నేహితు డొకడు ఓ పల్లెటూళ్ళో డ్రామా వెయ్యబోతున్నాడు. అతని స్నేహబృందమంతా సరదాగా సైకిళ్ళమీద బయల్దేరారు. నాటకం ముగిసి స్నేహితుణ్ణి అభినందించి అలసటగా యిళ్ళకి చేరేసరికి తెల తెలవార బోతూంది. నిద్రమత్తుతో గదిలోకి పోబోయిన మధుమూర్తి టక్కున ఆగి ముందు గదిలో మడతమంచంమీద ముసుగు దన్ని పడుకున్న వ్యక్తిని గమనించి .... రాజేశ్వరి కేసి ప్రశ్నార్థకంగా చూస్తూ నిలబడిపోయాడు.

"మా రాంబావ. రాత్రి సినిమాచూసి వెళ్ళిపోదామంటే బస్సు అందలేదట. వచ్చి పడుకున్నాడు."

భర్త చూపుల్లో తీక్షణత రేగుతోందన్న సంగతి రాజేశ్వరి గమనించలేదు. మొహం చిట్లించుకుంటూ విసురుగా గదిలోకి నడిచాడు మధుమూర్తి. రాజేశ్వరి మరి నిద్ర కుపక్రమించకుండా ఫస్టుబస్సుకి వెళ్ళిపోతానన్న బావగార్ని లేపి పనులు ప్రారంభించబోయింది.

"అన్నయ్య వచ్చాడా రాజ్యం !"

"ఆఁ. ఇప్పుడే వచ్చి పడుకున్నారు. తెల్లవార్లూ నిద్రలేనట్టుంది."

"పోనీలే. లేపకుగానీ నే నడిగినట్లు చెప్పు.... కాస్త మొహం కడుక్కుంటాను. నీళ్ళు తెచ్చిపెడుదూ ? కొత్త చోటైనా మీ యింట్లో బాగానే నిద్రపట్టింది నాకు."

రాజేశ్వరి పళ్ళపుల్లా, చెంబుతో నీళ్ళూ తెచ్చియిస్తూ అంది — "పాలు రాగానే కొంచెం కాఫీపెట్టి యిస్తాను. ఓ పావుగంట కూర్చోకూడదూ ?"

"ఎందుకు లెద్దూ ? అలా బయటికిపోతే కావలసినన్ని హోటళ్ళు బస్సుస్టాండు దగ్గిర తాగుతాను" మొహం కడుక్కుని, రాజేశ్వరి అందించిన దువ్వెనతో తల దువ్వుకున్నాడు — "మరి వెళ్తాను. ఏమైనా కబుర్లున్నాయా ?"

"ఏం వున్నాయి ? అత్తయ్యా వాళ్ళందర్నీ అడిగానని చెప్పు. నువ్విక్కడికి వచ్చినప్పుడల్లా కాస్త కన్పిస్తూవుండు."

"తప్పకుండాను. నిన్ను చూడాలని మాకు మాత్రం వుండదూ ?" వీధితలుపు తీసి తిరిగి వేసిన చప్పుడుకూడా విన్నాడు మధుమూర్తి .... ఇంటికి పోతూనే మంచంమీదికి ఒరిగిపోవాలనుకున్న మధుమూర్తి కొంతసేపు గదిలో పచార్లుచేశాడు — మరికొంతసేపు మంచంమీదపడి నిలకడ లేనివాడిలా దొర్లాడు. నిద్రతో కూరుకువచ్చిన కళ్ళు పొడారిపోయి భగభగా మండుతోంటే అరిచేతులతో ఒత్తుకున్నాడు. ఏం చేసినా ఎలాచేసినా వూరట చిక్కకపోయే సరికి విసురుగా లేచి గదితలుపు తీసుకు బయటికి వచ్చాడు.

"అదేమిటి? మీరింకా నిద్రపోనేలేదూ? మా బావ యిప్పుడే వెళ్ళి పోయాడు. మిమ్మల్ని అడిగానని చెప్పమన్నాడు."

"ఏం? అప్పుడే వెళ్ళనిచ్చావ్?"

"కొంచెం కాఫీపెట్టి యిస్తాను – వుండమంటే విన్నాడు కాదు. మీరు నిద్రపోతున్నారని లేపకుండా వెళ్ళాడు."

"అఘోరించాడు."

తృళ్ళిపడి చూసింది రాజేశ్వరి. భర్త మొహంలో ఎంతో మార్పు! అతనికి అమితంగా కోపం వచ్చినప్పటి మార్పు స్పష్టంగా కనుపించింది. కళ్ళు జ్యోతుల్లా వెలుగుతోంటే భయపడిన దానిలాగా తల తిప్పుకొంది.

"అయితే అతను తెల్లవార్లూ యిక్కడే పడుకున్నాడు కదూ?"

అయోమయంగా చూసింది. "సినిమా చూసివచ్చి పడుకున్నాడని చెప్పాను కాదూ?"

"చెప్పావులే—మగవాడులేని సమయంలో పరాయివాణ్ణి యింట్లో పెట్టుకు పడుకోటానికి నీకు సిగ్గులేక పోయిందా? వాడికి బుద్ధిలేక పోయిందా?"

రాజేశ్వరి కేదో శరాఘాతం తగిలినట్టయింది. మాట పెగిలి రాలేదు.

"ఏం మాట్లాడవ్? తప్పు చేస్తున్నానేమో నన్న ఆలోచన నీకు రానేలేదూ"—కోపంతో మండిపడుతూన్న భర్త కేసి విస్మయంగా చూస్తూ అంది రాజేశ్వరి—"తప్పా?....తప్పేమిటి?"

రెచ్చిపోయాడు మధుమూర్తి—"ఏమిటో నేను చెప్తేగాని నీకు అర్థంకాదా? నేను యింట్లో లేకుండా అర్ధరాత్రి వాడు రావటం– తెల్లారు తోంటే లేచిపోవటం తప్పుకాదన్నమాట— ఈ సంగతి ఎవరికైనా తెలిస్తే ఎంత అప్రదిష్టో ఆలోచించావా?"

"అ....ప్ర....ది....ష్ట!" అస్పష్టంగా అనుకొంది, రాజేశ్వరి అయోమయంగా.

"వాడు నీ మేనత్తకొడుకే కావచ్చు. నువ్వు నీతిమంతురాలవే కావచ్చు. అదంతా లోకానికి ఎందుకు? కళ్ళతో చూచినదానికి మాత్రమే

కల్పనలు చేసి కథ లల్లుతారు. నీమీద కేదైనా నిందవచ్చిపడతే సిగ్గూ లజ్జాలేని నువ్వు భరించగలవేమోగానీ నేను తట్టుకోలేను.''

రాజేశ్వరి మరి సహించలేకపోయింది. అన్యాయంగా తనని నింది స్తోంటే మౌనం వహించటం అవమానంగా కూడా తోచింది—"పడుకుం టానని యింటికి వచ్చినవాణ్ణి ఎలా పొమ్మనను ? అనలేకపోయాను" అంది భారమైన గొంతుతో కొంత ధైర్యంచేసి.

"అవును. నీకు పరువు ప్రతిష్ఠలకంటే బంధుమర్యాదలు కావాలి. అంతేనా ? వీధి అరుగుమీద పడుకోమనలేక పోయావ్ ? ఏం రాజాగారు గదిలోగాని పవ్వళించ డనుకున్నావా ! తెల్లవారితే లోకం వేలెత్తి చూపు తుందేమోనన్న భయం నీకేమైనా వుందా ? ఛీ, ఎందుకూ ? ఆడపుటక పుట్టావు!"—

కన్నీరంతా యింకి పోయినట్టయింది.

"లోకం !" కసి పుట్టుకొచ్చింది రాజేశ్వరికి —న్యాయాన్యాయాలు ఎంచకుండా గుడ్డిగా మూర్ఖంగా విమర్శించే లోకానికి నే నెన్నడూ భయ పడను, లెక్కచెయ్యను."

"నోర్మూయ్ నీ ధైర్యాలూ, సాహసాలూ యిక్కడ ప్రదర్శించకు. లోకాన్ని ధిక్కరించి తిరిగే సాహసం నీలాంటి దానికా ? మహామహులే తలలు దించేశారు. ఈ ఇంట్లో నా భార్యగా నా పరువు, ప్రతిష్ఠలు కాపాడుతూ తిరగాల్సిందేగాని నీ పిచ్చి పిచ్చి ఆటలేం సాగించుకోకు. లోకం విమర్శ నీకు అక్కర్లేకపోయినా నాకు కావాలి. లోకాన్ని నువ్వు ధిక్కరిస్తే నేను సమర్థిస్తాను. పస్తులుండైనా బ్రతుకుతానుగానీ పరువు పోగొట్టుకొని బ్రతకలేను. నీ శీలాన్ని గురించి ఎవ్వడైనా వేలెత్తిచూపితే నిన్ను నరికేసి నేను నరుక్కోవటం తప్పితే మరోదారి లేదు. నేను లేని రాత్రి యింత సాహసం చేశావంటే నా గుండెలు మండిపోతున్నాయి. తల్చుకుంటూన్నకొద్దీ శరీరం జలదరిస్తోంది — మరెన్నడూ యిలాంటి సంఘటన జరగటానికి వీలులేదు. తెలిసిందా?—"

రాజేశ్వరి అవమానాగ్నితో దగ్ధమైపోయింది.

"తెలిసింది. ఇక జీవితంలో జరగనివ్వను. నా వల్ల మీ పరువు పోనివ్వను. నా కోసం మీ సంఘాన్ని విమర్శించ నివ్వను. ఏనాడూ మిమ్మల్ని నవ్వులపాలు కానివ్వను. మీ మంచి చెడ్డలు ఆలోచిస్తూ అక్షరాలా మీ భార్యగా బ్రతుకుతాను—మీ భార్యగా.... భార్యగా" భార్యగొంతులోని గాంభీర్యం, మాటల్లోని ఆవేశం క్షణకాలం మధుమూర్తిని మూగవాణ్ణి చేశాయి. భార్యను చూస్తూ నించుండిపోయాడు చాలా సేపు— మధుమూర్తి భార్య శీలాన్ని ఎన్నడూ శంకించలేదు. శంకించేరోజు వస్తుందని కూడా అనుకోవటం లేదు. భార్య నీతిపట్లా— ప్రవర్తనపట్లా అతనికి అపారమైన విశ్వాసం వుంది. భార్య శీలసంపదపట్ల అంతులేని గౌరవం వుంది. తన గుండెల్లో గాఢంగా నాటుకుపోయిన ఈ అమూల్యాభిప్రాయాలు ఏనాటికీ సడలిపోవు. తన భార్య శీలం తనకో అదృష్టవరం —దాన్ని కళంకపరిచే హక్కు భగవంతుడికి కూడా లేదు. తన సంపదని తను పదిలపర్చుకొంటాడు. తన ప్రవర్తన కఠినంగా వుండొచ్చు అంతా తనకోసం.... తనకోసం....

రాజేశ్వరి నెమ్మదిగా కదిలి వంటింటికేసి నడవబోయింది.

"రాజీ!"

అనుకోకుండా శాంతించిన భర్త వైఖరి విస్మయం కలిగిస్తోంటే ఆగి వెనక్కి చూసింది. మధుమూర్తి రెండడుగులు ముందుకి వేశాడు— "నేను ఆవేశంగా మాట్లాడుతున్నా ననుకోకు రాజీ! నే నెందుకు చెప్పానో ఆలోచిస్తే నా బాధ నీకు అర్థమౌతుంది. ఎప్పుడైనా, ఏదైనా నిందవచ్చి పడుతుందేమో నన్న భయం స్త్రీగా నీకు లేదూ?"

"లేదు" సూటిగా భర్త మొహంలోకి చూస్తూ అంది రాజేశ్వరి— "నాకు ఎటువంటి భయాలూ ఉండాల్సిన అవసరంలేదు. నా ఆత్మవిశ్వాసం అంత బలహీనమైనదికాదు. నేను తప్పు చేయనంతకాలం, చెయ్యననే నమ్మకం వున్నంత కాలం సాక్షాత్తు భగవంతుడే వచ్చి వేలెత్తి చూపి అపహసించినా నేను చలించను— నా తెగించిన వ్యక్తిత్వం మీకు బొత్తిగా పనికిరాదని నాకు తెలుసు—భవిష్యత్తులో మీ కెన్నడూ కష్టం కలిగించనని మాట యిస్తున్నాను—మీరు లేని సమయంలో సోదరుడువంటి ఒక

ఆత్మబంధువుకి ఆశ్రయం యిచ్చినందుకు నేను తెలుసుకో గలిగిన నిజం అమూల్యమైనది. ఆడదాని శీలసంపద అవకాశాలనుబట్టే ఆధారపడి వుంటుంది. విశ్వాసాలూ, వ్యక్తిత్వాలూ, దాన్ని కాపాడలేవు. తప్పుచేసి తప్పుకోగలిగిననాడు పరువు దక్కుతుంది. తప్పు చేయకపోయినా నిరూపించుకోలేనినాడు అది సర్వనాశనమైపోతుంది. చిత్రమైన ఈ నిజాన్ని ఎప్పుడూ గుర్తుంచుకుంటాను." మరి నిలబడకుండా పెరటివేపు వెళ్ళిపోయింది రాజేశ్వరి.

తను తానుగా బ్రతికే స్వతంత్రం లేదన్న సంగతి ఆ రోజే రాజేశ్వరికి క్షుణ్ణంగా తెలిసివచ్చింది—"నీ ఆలోచనలతో నాకుపనిలేదు. నువ్వు నా భార్యగా బ్రతకాలి....నాభార్యగా బ్రతకాలి" అన్న మధుమూర్తి మాటలు మనస్సంతా ప్రతి ధ్వనించాయి–ఎంత మర్చిపోవాలని ప్రయత్నించినా నిష్ప్రయోజనమే అయింది. చలించిన మనస్సు శాంతించలేదు—లేదు. ఈ జన్మకికక శాంతిలేదు. తీరని కోరికలు నానాటికీ అధిక మౌతుంటే, ఆశలన్నీ అపోహలై అపహసిస్తోంటే శాంతి ఎక్కడ!-రాజేశ్వరికి హృదయంలో తీరని దాహంలా మరోకాంక్ష బలంగా లేచింది— తనకి సజీవమైన స్వతంత్రం కావాలి. అది సర్వ సంపదలకూ అతీతమైన పెన్నిధి! తన హస్తగతమైన ఆ విలువ నెన్నడూ దుర్వినియోగము చేసుకోదు. జీవితంలో ఏది చెయ్యాలన్నా తనకి స్వతంత్రం ఉంది—అది చెయ్యటంలో చెయ్యకపోవటంలో మంచి చెడ్డలు తనే నిర్ణయించుకుంటే....? — ఓ నిరాశాతరంగం వువ్వెత్తుగా లేచి రాజేశ్వరి ఆశల్ని మూలమట్టం చేసింది- తను ఆడది! భార్యగా బ్రతకాల్సిన ఆడది! ఆలోచించటం తప్పితే అనుభవించలేని ఆడది!

* * *

కలతనిద్ర రాజేశ్వరిని శాంతంగా ఆవరించింది. పల్చ పల్చగా వీస్తున్న పిల్లగాలులు ఆమె శరీరాన్ని సానుభూతిగా జోకొడుతున్నాయి. వెండితీగెల్లా విడిసి పడుతోన్న వెన్నెల కిరణాలు కిటికీలోంచి ఆమె

చెక్కిళ్ళమీదికి తొంగి చూస్తున్నాయి. చేయి జాపితే అందేంత సమీపంలో చందమామ వుందన్న ధైర్యంతో రాజేశ్వరి నిశ్చింతగా నిద్రపోయింది.

స్వప్నావస్థలో విహరిస్తున్న రాజేశ్వరి ప్రశాంతతికి భంగం కలిగేలా ఆమె హృదయంమీద చిత్రమైన ఏదో స్పర్శ.

వెన్నెలలో మునిగి చల్లబడిన చెక్కిళ్ళమీద వెచ్చ వెచ్చని గాలి తాకిళ్ళు! త్రుళ్ళిపడి లేవబోయిన రాజేశ్వరి వివశయై తలగడలో మొహం దాచుకుంది.

"రాజీ!" మధుమూర్తి కంఠంలో అనురాగ ప్రవంతి!—"నామీద నీ కింకా కోపం పోలేదుకదూ." మీదికి ఒంగి జుట్టు నిమురుతూ మత్తు మత్తుగా కన్నుల్లోకి చూడ ప్రయత్నిస్తూ మధురమైన రహస్యంలాగ మాట్లాడుతున్న భర్తమీద ఒక్కసారిగా ఏదో అనురాగం.... మరేదో మమకారం పొంగుకొచ్చాయి. అంతరంగమంతా ఆనందంతో నిండిపోగా భర్తను దగ్గరికి తీసుకుని హృదయానికి హత్తుకొంది—"మీ మీద ఎప్పుడూ కోపం రాలేదు....ఎప్పుడూ—" అని చెప్పాలను కొంది. మంత్రముగ్ధలాగ మాట్లాడలేక పోయింది.

మధుమూర్తి రాజీ చెక్కిలిని తాకుతూ అన్నాడు—"నేను మంచివాణ్ణి కాదు నిన్ను ఎప్పుడూ ఏదో అంటూ వుంటాను. అయినా నన్ను ఆదరిస్తూనే వున్నావు నువ్వు నా దేవతవు రాజీ!"

రాజేశ్వరి చూపులు చందమామ కేసి దారితీశాయి.

"నిన్ను మరేమీ అనను రాజీ! నీకు దూరంగా ఒక్కక్షణం ఉండలేను."

సున్నితమైన రాజీ పెదవులమీద సుందరమైన చిరునవ్వు నిలిచింది.

"నిజం రాజీ! నా మాట నువ్వెప్పుడూ నమ్మవుకదూ? నీ మీద నేనెప్పుడూ కోపం తెచ్చుకోను నన్ను నమ్ము రాజీ! నమ్మవూ?"

అమాయకంగా దగ్గిరికి చేరిన భర్త కన్నుల్లో ఏదో పసితనం .... పవిత్రంగా గోచరిస్తోంటే మరి మౌనం వహించలేక రాజీ అతని కంఠానికి చేతులు చుట్టి గాఢంగా హత్తుకొంది—అతి మృదువుగా మధురంగా

అతని హృదయంతో కబుర్లు చెప్పింది—"మిమ్మల్ని నేనెప్పుడూ నమ్ముతున్నాను. మీ మీద నమ్మకం లేనినాడు నాకు మరేమీ లేదు—మరేమీ లేదు."

"ఎంత మంచిదానివి రాజీ!" మధుమూర్తి రాజీని ఆవేశంగా పెనవేసుకున్నాడు—"నా కెప్పుడైనా కోపం వస్తే నువ్వు బాధపడకు రాజీ! నేనో పిచ్చివాణ్ణి. నన్ను నువ్వే అసహ్యించుకుంటే బ్రతకలేను. నా జీవితమంతా నీ చేతులలోనే వుంది. అవునను రాజీ!—"

రాజేశ్వరి హృదయం ఆర్ద్రమైపోయింది. కన్నుల్లో నీళ్ళు తిరిగాయి. ఎంత విచిత్రమైనదీ అవస్థ. తనకు— అందని దేముందీ? తను పొందలేని దేముందీ? తన ప్రేమికుడు—తన స్నేహితుడు— తన జతగాడు—తన సర్వస్వం—ఇలా పసిపాపలా చేతుల్లో వాలిపోతే యిక తనకి కోరదగిన దేముందీ?

ఎప్పుడూ తనని సన్నిహితంగా రానివ్వని భర్త— తన మనస్సు విప్పి చెప్పనివ్వని భర్త—తన వేదన వెళ్ళబోసి ఏడ్వనివ్వని భర్త—ఏం చెయ్యటానికీ తనకి స్వతంత్రం యివ్వని భర్త— ఇప్పుడు భర్తకాడు. అధికారి కాడు. కఠినుడూ కాడు, నిరంకుశుడూ కాడు.

జతగాడు:—తన సహచర్యాన్నర్థించే సన్నిహితుడు!

భిక్షగాడు:— తన ప్రేమ ఫలాన్నాశించే క్షుధార్తుడు.

భగవాన్! స్త్రీ జీవితంలో ఎంతటి పుణ్యక్షణాలు సృష్టించావు! సర్వస్వాన్నీ పాదాక్రాంతం చేసుకోగలిగే ఈ క్షణాలు ఎంత అమూల్యమైనవి? నికృష్టపు స్త్రీ జన్మ కీ పవిత్ర క్షణాలు కరువైతే మనుగడేముంది? అడుగడునా అపహసించే పురుషుడు, స్త్రీని యింతగా ఆరాధించే ఈ ఘడియలలో ఎంత మహత్తు వుందీ!

స్త్రీ, పురుషుడికి ఏమీ యివ్వలేకపోతే ఆ దౌర్భాగ్యురాలి చుట్టూ ఏనాడో గోరీ లేచేది కాదా?

"రాజీ! ఏమిటా ఆలోచన? మాట్లాడవూ!"

మాట్లాడాలని లేదు రాజీకి. నిజంగా మాట్లాడాలని లేదు. అతను దగ్గిరికి జేర్చుకున్న ఆ క్షణం హృదయాన్ని బ్రద్దలు కొట్టి అతనిలో

ఐక్యమైపోవాలని పిస్తోంది. సర్వసామాన్యమైన వేదనలకూ, కన్నీళ్ళకూ అందకుండా అతని గుండెల వెనుక దాగిపోవా లనిపిస్తోంది—ఈ క్షణం శాశ్వతం కావాలి, అబద్ధం కాకూడదు నిత్యనూతనం కావాలి. గతించి పోకూడదు.

"రాజీ! నీకన్నుల్లో వెన్నెల వుంది, నీ పెదవుల్లో అమృతం వుంది. నన్ను అందుకో నివ్వవూ"— అవే మాటలు ఎన్నిసార్లు విన్నా లలిత లలితంగా వుంటాయి.

సుఖపూరితమూ—మధురాతి మధురమూ అయిన ఆ మాటలు వింటూ సిగ్గుతో బరువుగా కళ్ళు దించుకున్న రాజేశ్వరి హాయిగా తన్ను తాను మరిచి నిద్రలోకి జారిపోయింది—స్వప్న లోకాలలో తేలిపోయింది.

* * *

సన్నసన్నగా పాప ఏడుపు విన్పిస్తోంటే నీరసంగా కదిలింది. తూలుతూలేచి నిలబడింది. దోమతెరలో పడుకుని గాఢంగా నిద్రపో తూన్న భర్తనీడ మసగ మసగ్గా కన్పించింది— గడిచిపోయింది. తనని దేవతని చేసి అందలం ఎక్కించిన పుణ్యకాలం గతించిపోయింది. తను రాజేశ్వరి!—ఉత్త రాజేశ్వరి! తలతిక్కగా మాట్లాడుతూ — దురహంకారం ప్రదర్శిస్తూ—ఎప్పటికప్పుడు నవ్వులపాలయ్యే దురదృష్టపు రాజేశ్వరి! ఖర్మరాసినట్లు బ్రతకలేక— బ్రతుకుమీది అనురాగంతో చావలేక — అప నిందలకూ—అపహాస్యాలకూ గురౌతూ — క్షణక్షణం ఆత్మాభిమానాన్ని చంపుకొంటూ—నిరాశలతో— నిట్టూర్పులతో — జీవచ్ఛవంలా గడుపు కొంస్తూన్న నికృష్టపు రాజేశ్వరి! ఆకలితో పాప ఏడుపు పెద్దదైంది. నిర్ల క్ష్యంగా మర్చిపోయిన తల్లికి దుఃఖం వచ్చింది. రెండడుగుల్లో వెళ్ళి పాపని చేతుల్లోకి తీసుకుని అక్కున జేర్చుకుంది.

పాప ఏడుపు ఆగిపోయినా — ఏమీ తెలీని పసిపాపని చూస్తోంటే తల్లి హృదయం శాంతించలేదు! జలజలా రాలి కన్నీళ్ళు పాప చెక్కిళ్ళ మీద పడుతోండగా పిచ్చిపిచ్చిగా—ఓదార్పుగా చెప్పుకోసాగింది—

"పాపా! ఈ లోకం సంగతి నీకేమైనా తెలుసా? తెలిస్తే నువ్వింత హాయిగా నవ్వకోగలవా? నిశ్చింతగా నిద్రపోగలవా? రేపు నీ చిన్నారి కళ్ళువిప్పి అంతా చూస్తావు విచిత్రంగా. నీ బుల్లి పాదాలు మోపి చకచకా నడుస్తావు ఆవేశంగా. నీ ముద్దులు మూటగట్టే నోరువిప్పి ఎన్నో మాట్లాడుతావు అమాయకంగా—కాని నువ్వు ఏది చేసినా, ఏం చేసినా విమర్శించబడతావు తల్లీ—నవ్వులపాలౌతావు—నువ్వు ఆడదానివన్న సంగతి మర్చిపోతావేమోనని లోకం భయపెడుతూ వుంటుంది. నీ రక్తమాంసాల్లో ఒకటిగా పెరుగుతూ వస్తూన్న అభిమానం అంతం చేసుకోవలసి వస్తే నీ హృదయం బద్దలై పోదూ? గర్వంగా, విశిష్టంగా ఏర్పరచుకున్న నీ వ్యక్తిత్వం వమ్మై పోతోంటే నీ తనువు తల్లడిల్లిపోదూ? అమ్మా! చిరంజీవీ! నేనేం చెయ్యను? నేనేం చెయ్యగలను? నా వారసత్వంకోసం నిన్ను కన్నానని నిందవేస్తావా? బొమ్మగా బ్రతకలేనని దుఃఖపడతావా? సర్వసామాన్యమైన ప్రకృతి ధర్మాన్ని మీరలేకపోయిన ఈ అమ్మని క్షమిస్తావా? మనసారా క్షమిస్తావా....వద్దుతల్లీ! వద్దు. ఎవరు క్షమించినా నన్ను నేను క్షమించుకోను. మనం చచ్చిపోతే....నిన్ను మళ్ళా కడుపులో దాచుకుని....నేను చచ్చిపోతే...."

"రాజీ!" మెలకువ వచ్చిన మధుమూర్తి ఆవేశంగా అరిచాడు.

త్రుళ్ళిపడింది రాజేశ్వరి. కట్టలు తెగిన దుఃఖానికి అడ్డువెయ్యటానికి ప్రయత్నించకుండా మధుమూర్తి చేతుల్లో వాలిపోయింది.... చేజారిన పెన్నిధిని దక్కించుకున్నంత ఆరాటంగా రాజీని పెనవేసుకున్నాడు మధుమూర్తి—"రాజీ! ఏమిటిది?"

జవాబుగా అతని పాదాలు కన్నీటితో అభిషేకం చేసింది రాజీ.

"ఇన్నాళ్ళూ నిన్ను అర్థం చేసుకోలేకపోయాను రాజీ! అర్థం చేసుకోవాలనికూడా ప్రయత్నించలేకపోయాను. ఇందుకేనా ఎప్పుడూ నువ్వు బాధపడుతూ వుంటావు? నీ దుఃఖానికి కారణం— అసలు నువ్వు

దుఃఖపడుతున్నావనే విషయం— ఎంతమాత్రమూ తెలుసుకోలేకుండా గడిపాను. కానీ రాజీ! నేనెంత అదృష్టవంతుణ్ణో కూడా నా కిప్పుడే తెలుస్తోంది. మనసు వున్న మనిషి సన్నిధిలోనే బ్రతుకుతూ వున్నానన్న సంగతి తెలుసుకుంటే ఎంత ఆనందం కలుగుతుంది!" అంటూ ఏమేమో చెప్పాలనుకున్నాడు—మూగవోయిన మనస్సు మాటలు రానివ్వ లేదు— చేష్టల ద్వారానే తన ఆలోచన వెల్లడించాలని భార్యని ఆవేశంగా అదుముకున్నాడు.

భర్త అనురాగమేదో విచిత్రంగా తోచింది రాజేశ్వరికి. ఎన్నడూ లేని ఓదార్పేదో లభించబోతూన్నట్టు అనుభూతి కల్గింది—"నన్ను అర్థం చేసుకోరూ....నన్ను....నామనస్సు....ఒక్క—సారి....అర్థం చేసికోరూ?" అంటూ ఏడవాలన్నంత ఆరాటం ముంచుకొచ్చింది.

వెన్నెలకన్నా చల్లగావున్న భర్త సన్నిధిలో కళ్ళుమూసుకు వుండి పోయింది.

(1964 ఏప్రిల్ "యువ" నుంచి)

★